
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 82 వ భాగం

### వృత్తాసుర వృత్తాంతం – 6, దేవగురువుగా విశ్వరూపుడు

దేవేంద్రుడు సింహాసనం మీద కూర్చునున్నపుడు బృహస్పతి వస్తే లేచి గౌరవం చూపించనపుడు ఆయన శోకంతో వెనుతిరిగి వెళ్ళిపోయాడు. తప్పు తెల్సుకున్న ఇంద్రుడు గురువు ఇంటికి వెళ్ళేసరికి ఆయన కనిపించకుండా పోయాడనీ, దానితో రాక్షసులు దండెత్తుకొచ్చారనీ, ఆ యుద్ధంలో దేవగణాలు ఓడిపోయి పారిపోయారనీ క్రితం వ్యాసంలో చూసాం. అలాగే అధ్యాత్మ మాయ అంటే ఏమిటో, అసలు ఈ దేవాసుర సంగ్రామం అంటే మనలో జరిగే నిత్య సంఘర్షణ అనేది కూడా చూసాం.

క. అమరులు విసృష్ట దానవ
సమరులు శరభిన్న దేహ సంతాపగుణ
భ్రమరులు దైత్య కిరాతక
చమరులు కమలజుని కడఁకుఁ జనిరి భయార్తిన్. [6-277]

ఇప్పుడు ఓడిపోయిన దేవతలు బ్రహ్మదేవుడి (కమలజుడు – పద్మంలో పుట్టినవాడు) దగ్గిరకి వెళ్ళారు. మనలో మంచి గుణాలు నాశనం అవుతుంటే ఏమౌతుంది? సంతాపం అనేది ఓ రోజు కలుగుతుంది. ఆ రోజున అసలు నేనెందుకు పుట్టాను, జీవితంలో నా లక్ష్యం ఏమిటి అనేవి గుర్తుకొస్తాయి. ఇదే బ్రహ్మ దగ్గిరకి వెళ్ళడం అనుకోవచ్చు.

ఉ. ధాతకు దేవతా విభవదాతకుఁ బుణ్యజనానురాగ సం
ధాతకు సర్వలోకహితదాతకు వైదిక ధర్మమార్గ ని
ర్ణేతకు నుల్లసద్విభవ నేతకు సర్వ జగజ్జయాంగజ
భ్రాతకుఁ బుణ్యయోగిజన భావవిజేతకు మ్రొక్కిరయ్యెడన్. [6-278]

వెళ్ళిన దేవతలు బ్రహ్మతో మొరపెట్టుకుంటున్నారు – ఆ బ్రహ్మ ఎటువంటివాడంటే, ధాత, దేవతావిభవదాత – దేవతలకి వైభవం సమకూర్చేవాడు, పుణ్యజనానురాగసంధాత – పుణ్యాత్ములని ప్రేమించేవాడు, సర్వలోకాలకీ హితుడు, వైదికమార్గ నిర్ణేత – వేద ధర్మాలని నిర్ణయం చేసేవాడు, జగజ్జయాంగజభ్రాత – అన్ని లోకాలనీ జయించగలిగే మన్మధుడికి సోదరుడు. సింగయ గారి ఈ పద్యం ప్రాసలోంచి పోతన నవ్వుతూ తొంగి చూస్తున్నాడు గమనించారా?

క. ఆఖండలుండు మొదలుగ
లేఖానీకముల బ్రహ్మ లేనగవున ని
త్యాఖండ సత్కృపారస
శేఖర వాక్యముల వారి సేదలు దేర్చెన్. [6-279]

తనదగ్గిరకి వచ్చిన దేవతలనీ దేవేంద్రుడినీ బ్రహ్మ చిరునవ్వుతో, మంచిమాటలతో ఓదార్చాడు. దీని అర్థం ఏమిటంటే, "తప్పు చేసినా తెల్సుకున్నారు కనక, సరే మరో ప్రయత్నం చేయండి" అని చెప్పడం అన్నమాట. ఈ పద్యంలో దేవేంద్రుడు, దేవతలు, మంచి మాటలు అనే పదాలెక్కడున్నాయో గమనించారా? అఖండలుండు — దేవేంద్రుడు; లేఖానీకములు — లేఖ —దేవతలు, అనీకములు — సమూహములు; శేఖర వాక్యముల — ఉత్తమమైన వాక్యములు. ఇంతకు ముందో సారి చెప్పుకున్నాం, ఏ మత గ్రంథం చూసినా 'తప్పు చేసావు కనక నీకు ఇంక వేరు దారి లేదు నరకమే' అని ఎక్కడా ఉండదు; ఎందుకంటే భగవంతుడు అపారకరుణామయుడు, ఎన్ని తప్పులు ఎన్ని వేల కోట్లజన్మలలో చేసినా సరే, 'మరోసారి ప్రయత్నం చేయి' అంటూ మన వెనకే ఉండి ప్రోత్సాహం ఇచ్చేవాడు కనక ఆయన భగవంతుడు.

ఉ. నెట్టన పాపకర్మమున నేరమిఁ జేసితి రేమి చెప్ప; మీ
పుట్టిన నాఁటనుండియును బుద్ధులు జెప్పి జగంబు లేలఁగాఁ
బట్టముఁ గట్టి పెంచిన కృపానిధి బ్రహ్మకళావిధిజ్ఞుఁ జే
పట్టక గుట్టు జాఱి సిరిపట్టునఁ దొట్టిన పొట్ట క్రొవ్వునన్. [6-281]

తెలిసీ చేసిన పాపం ఇది. మీరు పుట్టినప్పటినుండీ బుద్ధులు చెప్పి, జగాలని ఏలడానికి మీకు పట్టం కట్టిపెట్టాడు మీ గురువు. ఆయన బ్రహ్మవేత్త, కృపాళువు, అయినా మీకు మద గర్వం, క్రొవ్వు పెరిగిపోయి ఇలా తయారయ్యేరు. ఎందువలన అంటే, సిరిపట్టున — సిరిసంపదల వల్ల, పొట్టక్రొవ్వునన్ — గర్వం పెరిగి.

వ. బ్రహ్మిష్ఠుం డైన బ్రాహ్మణు నాచార్యుం గైకొనక గురుద్రోహంబు చేసితిరి; తద్దోషం బిపుడు మీఁకుఁ జేసేఁత శత్రుకృతం బై యనుభవింపం జేసె; నతి బలవంతులయిన మిమ్ము నతి క్షీణులైన యారాక్షసులు జయించుట దమ యాచార్యుండైన శుక్రు నారాధించి తన్మంత్ర ప్రభావంబునఁ బునర్లబ్ధ వీర్యు లగుటచేతనే; ఇప్పుడు మదీయంబైన నిలయంబు నాక్రమింపం గలవారై మదోద్రేకంబున నెదురు లేక వర్తిల్లుచున్న రక్షోనాయకులకుం ద్రిదివంబు గొనుట తృణప్రాయంబు; అభేద్య మంత్ర బలంబుగల భార్గవునకు వారు శిష్యులగుటంజేసి విప్ర గోవింద గవేశ్వరానుగ్రహంబు గలవారలకుఁ దక్కం దక్కిన రాజుల కరిష్టంబగుం; గావున మీ రిప్పుడు త్వష్ట యను మను పుత్రుండగు విశ్వరూపుం డను ముని నిశ్చల తపో మహత్త్వ సత్త్వ స్వభావుం డతని నారాధించిన, మీకు నభీష్టార్థంబుల నతండు సంఘటిల్లఁ జేయు; నిట్టి దుర్దశల నతం డడంచు" నని చెప్పిన దిక్పాలకాదులు దెండంబులు డిందుపడి కమలగర్భుని వీడ్కొని విశ్వరూపు కడకుం జని యిట్లనిరి. [6-282]

నిశితంగా గమనిస్తే మనకి తెలిసేదేమంటే, మనలో చెడు గుణాలకి తావివ్వడంతో అవి విస్తరించి సత్వగుణాలని అణిచేసాయి. మంచి గుణాలు అతి బలవంతమైనవి కానీ ఎప్పుడైతే చెడు గుణాలకి చిన్న సందు ఇచ్చామో, అవి క్షీణమైనట్టు కనిపించినప్పటికీ అవన్నీ మరోసారి విజృంభించి, సత్వగుణాలని నాశనం చేస్తున్నాయి. ఈ సమయంలో వాటిని ఎదుర్కోవడం కష్టం. అందువల్ల మరోసారి గురువుని ఆశ్రయించాలి (శరణు కోరడం).

బ్రహ్మవేత్త అయిన బృహస్పతిని అవమానించి గురుద్రోహం చేసారు. ఆ దోషం వల్ల ఇప్పుడు శత్రువుల వల్ల ఓడిపోవడం తటస్థించింది. లేకపోతే అతి బలవంతులైన మిమ్మల్ని అతి క్షీణులైన రాక్షసులు జయించడం సాధ్యం కాదు కదా? శుక్రాచార్యులని ఆరాధించి రాక్షసులు మరోసారి పరాక్రమవంతులయ్యారు. ఈ స్థితిలో వారికి స్వర్గం ఆక్రమించడం అనేది అతి సులభం (తృణప్రాయంబు). అభేద్యమైన మంత్రబలం ఉన్న శుక్రాచార్యులకి వాళ్ళు శిష్యులు కనక ఈ సమయంలో బ్రహ్మవేత్తలకీ, గోవింద, గోవుల అనుగ్రహానికి గురైనవారు తప్ప మిగతావారికి కీడు జరుగుతుంది. ఈ సమయంలో మీకు కావాల్సింది గురువు కనక త్వష్ట అనే మనువుకి పుత్రుడైన విశ్వరూపుణ్ణి ఆరాధిస్తే, ఆయన మహత్వం వల్ల మీకు మంచి జరుగుతుంది. బ్రహ్మ ఇలా చెప్పేసరికి దేవతలు విశ్వరూపుడి దగ్గరకి బయల్దేరారు.

సీ. అరయ నాచార్యుండు పరతత్త్వరూపంబు;
దండ్రి దలంపఁగ ధాతరూపు;
రూపింప భ్రాత మరుత్పతి రూపంబు;
దెలియంగఁ దల్లి భూదేవిరూపు;
భగిని కరుణరూపు; భావంబు ధర్మ స్వ;
రూపంబు దా నర్థిరూపు మొదల
నభ్యాగతుఁడు మున్న యగ్ని దేవునిరూపు;
సర్వభూతములుఁ గేశవుని రూపు; [6-286]

ఆ. గాన తండ్రి వేగ కదు నార్తులగు పితృ
జనులమైన మమ్ముఁ జల్లఁ జూచి
పరభయంబు వాపి నిరుపమం బగు తపో
మహిమచేత మెఱసి మనుపవయ్య! [6-286.1]

గురుసేవకన్నా మరో మంచి విషయం లేదు భువిలో. అందువల్ల నిన్ను అడుగుదామని వచ్చాం. తండ్రి బ్రహ్మ స్వరూపుడు, తల్లి భూదేవి రూపం, అన్న దేవేంద్రుడి రూపం, సోదరి దయాస్వరూపం. వీళ్ళందరి వల్లా లాభం పొందే తాను అర్థించేవాడు, అభ్యాగతి అగ్ని దేవుడి స్వరూపం, సర్వభూతాలు కూడా విష్ణు స్వరూపం అయితే గురువు మాత్రం సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపం. ఇప్పుడు పితృజనులమైన మేము భయంతో ఉన్నాం కనక నీ మహిమ చేత కాపాడు.

క. గురుధనముఁ గూర్ప నేటికి
గురుశిక్షం దగిలి మంత్రకోవిదులై స
ద్గురుధర్మ నిరతు లేనిన్
గురువులకును శిష్యవరులె కూర్చిన ధనముల్. [6-290]

దేవతలు ఇలా అనేసరికి విశ్వరూపుడు చెప్తున్నాడు సమాధానం. గురువు చెప్పిన వాటిని ధర్మంతో ఆచరించే శిష్యులే గురువుకి అన్నివిధాలైన ధనం కింద లెక్క, ఆయనకి వేరే గురుధనం ఇవ్వనక్కర్లేదు. ఇక్కడ పరోక్షంగా విశ్వరూపుడు చెప్తున్నాడు తాను గురువు అయితే దేవతలు ఎలా ఉండాలో.

సీ. అరయ నకించను లై నట్టివారికిఁ;
దగు శిలోంఛనవృత్తి ధనము సుమ్ము;
దానిచే నిర్వర్తితప్రియసాధు స;
త్క్రియ గలవారలై ప్రీతినొందె
దరు గాన సద్గర్హితాచారమైన యా;
చార్యత్వ మిపుడు మీ శాసనమునఁ
గైకొంటి; గురువుల కామంబు ప్రాణార్థ;
వంచనములు లేక వడి నొనర్తు" [6-291]

ఆ. ననుచు విశ్వరూపుఁ డనియెడు ముని ప్రతి
జ్ఞోక్తిఁ బలికె వారి నూఅడించి
మహితమైన తత్సమాధిచే గురుభావ
మమరఁ జేసె దేవసమితి కపుడు. [6-291.1]

ఏమీ సంపద లేని వారికి దంచిన చోట దొరికిన గింజలు ఏరుకుని తినడమే (శిలోంఛన వృత్తి) ధనం. అయినా వాళ్ళు వాటితోటే సాధుజీవనం ప్రీతితో సాగిస్తూంటారు కానీ గురువులమని కానీ ఎవరో అడిగారని గురువుగా ఉండడం కానీ చేయరు. కానీ ఇప్పుడు మీరు వచ్చి అడిగారు కనక మీకు పౌరోహిత్యం చేయడానికి సిద్ధమే.

క. భార్గవవిద్యా గుప్త
స్వర్గశ్రీ ద్విగుణ దనుజ సమధిక సంప
ద్వర్గముల విష్ణుమాయా
నర్గళగతిఁ దెచ్చి యింద్రునకు నిచ్చె నృపా! [6-292]

కథ ఇలా జరుగుతూండగానే ఈ లోపున శుక్రాచార్యుల వల్ల రాక్షసుల సంపద రెట్టింపు (ద్విగుణ) అయింది. అయితే విశ్వరూపుడు ఆ సంపదలకి పైబడిన సంపదలని ఇంద్రుడికి తెచ్చిపెట్టాడు. ఎలా? విష్ణుమాయ వల్ల మాత్రమే ఇటువంటివి సాధ్యం కాబట్టి.

క. ఏ విద్యచేత రక్షితుఁ
డై వజ్రి దురంబులోన నసురలఁ ద్రుంచెన్
భావింప నట్టి విద్యను
శ్రీవరమాయామతంబుఁ జెప్పెను హరికిన్. [6-293]

ఏ విద్య చేత అయితే వజ్రి (వజ్రాయుధం ధరించేవాడు, ఇంద్రుడు), సమరంలో అసురులని చంపగలడో అటువంటి విద్య, శ్రీవరుడిదైన (విష్ణువు) నారాయణకవచం అనేదాన్ని విశ్వరూపుడు ఇంద్రుడిచ్చాడు.

ఉ. నావుడు పాండవాన్వయుఁడు నమ్మినభక్తి జగన్నివాసు రా
జీవదళాక్షుఁ గృష్ణుఁ దన చిత్తమునన్ భజియించి పల్కె "నో
దేవగణార్చితాంఘ్రియుగ! దివ్యమునీశ్వర! విశ్వరూపుఁడ
ప్పావనమైన విద్య సురపాలున కే క్రియ నిచ్చెఁ? జెప్పవే. [6-294]

శుకమహర్షి ఇలా చెప్పేసరికి పరీక్షిత్తు – మనసులో వాసుదేవుణ్ణి మనసులో భక్తితో తల్చుకుని అడుగుతున్నాడు, "ఏ విధంగా విశ్వరూపుడు పావనమైన ఈ విద్య ఇంద్రుడికి ఇచ్చాడు?"

ఉ. ఎందును రక్షితుం డగుచు నింద్రుఁడు లీలయ పోలె వైరి సే
నం దునుమాడి దేవతలు నమ్మి సుఖింపఁగ నిష్టసంపదం
జెంది సమస్తలోకముల జేకొని యేలె మునీంద్ర! దాని నే
విందు సుఖంబుఁ గందు నిఁక వీనులు సంతస మందఁ బల్కవే. [6-295]

ఏ విద్యచేత రక్షితుడౌతూ, ఇంద్రుడు ఆట ఆడుకున్నట్టూ (లీలయపోలె), వైరిసేనలని (రాక్షసమూహాన్ని) జయించగలిగాడో, సంపదలని చెంది లోకాలని ఏలుకోగలిగాడో ఆ విధం, ఈ నారాయణకవచం ఎలా విశ్వరూపుడినుంచి నేర్చుకున్నాడో ఆ కథ వీనులవిందుగా వినిపించండి.

క. వర నారాయణ కవచము
నరిభీకర వజ్రకవచ మాశ్రిత సంప
త్పరిణామ కర్మసువచము
పురుహూతున కెట్లు మౌని బోధించె? దగన్. [6-296]

శ్రేష్టమైన (వర నారాయణ) ఆ నారయణ కవచం, భీకరమైన శత్రువులని పారదోలే ధుర్భేద్యమైన (అరిభీకర వజ్రకవచము), సత్పరిమాణాలు కలిగించే ఆ నారాయణకవచాన్ని పురూహుతుడికి (ఇంద్రుడికి) ఎలా ఇచ్చాడు?

ఇక్కడో సారి ఆలోచిస్తే సద్గుణాలకి అలవాలమైన దేవతలు అవన్నీ పోయాక భగవంతుణ్ణి ఆశ్రయించారు. గురువు పరబ్రహ్మ స్వరూపుడూ, అపారకరుణాసాగరుడూ కాబట్టి, విశ్వరూపుడి దగ్గిరకి వెళ్ళారు దేవతలు. ఆయన చెప్పిన ప్రకారం నడుచుకుంటున్నప్పుడు మరోసారి భగవనుగ్రహం కలిగి – నారాయణ మహిమ వల్ల సత్వగుణాలన్నీ పైకి తేలాయన్నమాట. పూర్తిగా విజ్ఞానం కలగాలంటే మాత్రం ఈ రెండూ – మంచీ, చెడూ – మనసులోంచి పూర్తిగా అంతరించాలి. అలా కోరికలన్నీ అంతరించాక పరిశుద్ధమైన మనస్సు భగవంతుడికి అర్పించడమే శ్రీ శంకరభగవత్పాదులు చెప్పిన – భవతు భవదర్థం మమ మనః

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS